క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నారాయణపేట: పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ మహ్మద్ రఫీ తెలిపారు. సాయివిజయ్‌కాలనీతో పాటు చుట్టుపక్కన ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధి హామీకి నిధులు పెంచాలి



నారాయణపేట టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జాతీయ ఉపాధి పథకం నిధులు పెంచాలని ఏఐపీకేఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రశాంత్, సాయిలు, చెన్నారెడ్డి, నారాయణ, అంజి, గణేష్, కృష్ణ, కతలప్ప, నర్సింహులు పాల్గొన్నారు.

కోర్టు డ్యూటీ సక్రమంగా నిర్వహించాలి



మాగనూర్: కోర్టు డ్యూటీ అధికారులు విధులు సక్రమంగా నిర్వాహించాలని ఎస్ఐ నరేందర్ అన్నారు. శనివారం ఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు స్థానిక పోలిస్టేషన్‌లో శిక్షణ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తు, విచారణలోని సమయంలో కోర్టు డ్యూటీ అధికారి సమర్థవంతంగా సాక్షులు, నిందితులు కోర్టులో హాజరు పరిస్తే కేసుల విచారణ వేగవంతంగా సాగుతుందన్నారు.

నారాయణపేట రూరల్: జిల్లాలోని అన్ని పీఎస్‌లలో కోర్టు డ్యూటీ నిర్వహిస్తున్న పోలీసు ఆఫీసర్లకు సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు శనివారం వారివారి పీఎస్‌లలో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. కేసు దర్యా ప్తు, ప్రాసిక్యూషన్, ఇన్వెస్టిగేషన్ చేయాల్సిన పద్ధతిని వివరించారు. సాక్షులు, నిందితులను కోర్టుకు హాజరుపరిచే విధానం, సకాలంలో కేసులు పూర్తి అ య్యే విధంగా తీసుకోవాల్సిన చర్యలు తెలిపారు.

మహాసభకు తరలిరండి



మాగనూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 7వ తేదీన నిర్వహిస్తున్న టీయూడబ్ల్యూజే హెచ్–143 జిల్లా మహాసభలకు ఉమ్మడి మండలాల నుంచి జర్నలిస్టులు తరలిరావాలని జిల్లా ఇన్‌చార్జ్ గోవర్ధన్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో జర్నలిస్టులతో కలిసి సభ్యత్వ నమోదు చేపట్టారు. మహాసభలకు హాజరై ఐక్యత చాటాలన్నారు. అనంతరం మహాసభల పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నవీన్‌కుమార్, రఘు, ప్రహ్లాద్‌రెడ్డి, గురుప్రసాద్‌రాజు, శేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపు అడ్డుకోవాలి

మాగనూర్: మండలంలోని నేరడగం చెందిన కొందరు తమ పొలంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని శివలింగ శనివారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ 5 ఎకరాలలో 36 గుంటలు భూమి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరారు.

పనులు ప్రారంభం



దామరగిద్ద: మండల కేంద్రంలోని 13వ వార్డులో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ మంజూరు చేసిన నిధులతో రోడ్డు పనులు చేపడుతున్నట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సప్ప, విండో అధ్యక్షుడు ఈదప్ప, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్, సర్పంచ్ ఆశమ్మ, ఉప సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

మక్తల్: పట్టణంలోని ఒకటవ వార్డులో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. రోడ్డు పనులను చేసేందుకు అందరు సహకరించాలని తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ శ్వేతారెడ్డి, ఏఈ నాగశివ తదితరులు ఉన్నారు.

తీరని సమస్యలతో సతమతం



భీవండి కాలనీలో రాజీవ్‌గృహ కల్ప నివాసాల వద్ద చెత్త



స్తంభానికి విరిగిపోయిన వీధిలైటు

- ఏళ్లు గడుస్తున్నా డ్రెయినేజీ నిర్మాణం లేని వైనం
- వీధి లైట్లు లేక రాత్రి వేళ అంధకారం
- వర్షాలు వస్తే ఇంట్లోకి వరద నీరు



అసంపూర్తిగా ప్రధాన డ్రెయినేజీ పనులు

నారాయణపేట టౌన్: పట్టణంలోని భీవండి కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. రాజీవ్‌గృహ కల్ప వద్ద సరైన వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో కాలనీవాసులు తమ సమస్యలు పట్టించుకోరని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వస్తే వరద ఇళ్ల ముందు నిలిచిపోతే, కేవలం తాత్కాలికంగా సరిచేస్తున్నారని, శాశ్వత పరిష్కరం నోచుకోవడం లేదని వాపోతున్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్ అందించారని వాటితో కొంత ఉపశనం కలిగిందన్నారు. భగీరథ నీరు రాకుండా కాలనీలో ఉన్న ట్యాంకు ద్వారా నీటి సరఫరా చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు.

ఇళ్ల మధ్యనే చెత్తా చెదారం, మురుగు

రాజీవ్ గృహ కల్ప ఇళ్ల ముందే మురుగు పారడంతో దుర్వాసనతో పాటు పందులు స్వైర విహారం చేస్తున్నాయని, దీంతో దోమలతో రాత్రి, పగలు తేడా లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. మురుగు ప్రధాన కాల్వలో కలవకుండా అసంపూర్తి పనుల కారణంగా ఏళ్ల నుంచి డ్రెయినేజీలు లేక అవస్థలు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి రోడ్డు దిక్కు కావడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇక సాయంత్రం అయితే ఒక కరెంట్ స్తంభానికి వీధి బల్బులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళ నానావస్థలు పడకతప్పడం లేదని వాపోతున్నారు. రాత్రి వేళ విషపురుగులు, పాములు సంచారిస్తున్నాయని భయందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మున్సిపాలిటీ అధికారులు వీధిలైట్లు ఏర్పాటు చేస్తే నేటికి కొత్తవి ఏర్పాటు చేయడం లేదని తెలిపారు. చెత్త వాహనాలు రోజువారీగా రాకపోవడంతో చేసేది లేక ఎక్కడ పడితే అక్కడే చెత్త వేస్తున్నారు. చెత్త వాహనాలు పది రోజుల ఒకసారి వస్తే ఏమి చేయాలని కాలనీవాసులు అంటున్నారు. ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

రాత్రివేళ ఇబ్బందులు



రాజీవ్ గృహ కల్ప వద్ద కరెంట్ స్తంభానికి ఒక్క వీధి లైటు లేకపోవడంతో రాత్రి వేళ ఇబ్బందులకు గురవుతున్నాం. ఎన్నో సార్లు అధికారులకు విన్నవించినా లైట్లు ఏర్పాటు చేయడం లేదు. డ్రెయినేజీలు కూడా నిర్మాణం లేక తీవ్ర ఇబ్బందులు తప్పడం పడుతున్నాం. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– సబాబ్, భీవండి కాలనీ, నారాయణపేట

దుర్వాసన భరించలేం..



ఇళ్ల ఎదుట మురుగు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుంది. మురుగు కుంటగా మారిపోవడంతో పందులు, ఈగలు, దోమలతో సతమతం అవుతున్నాం. అధికారులు వెంటనే డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించాలి.

– నర్సమ్మ, భీవండి కాలనీ, నారాయణపేట

మార్మోగిన శివనామస్మరణ



కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ శనివారం శివనామ స్మరణ మార్మోగింది. గ్రామంలో ఉదయం కృష్ణానది నుంచి గంగాజలంను తీసుకొచ్చి శివపార్వతులకు అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మక్తల్ మల్లికార్జునస్వామి ఆలయ అర్చకుడు తిప్పయ్య స్వామి ఆధ్వర్యంలో శివమాలదారులు మెట్లపూజ, కలశపూజ, మహా మంగళ హారతిని చేపట్టారు. కార్యక్రమానికి కడెచూర్ పీఠాధిపతి గురుమూర్తి మహాస్వామి భక్తులకు తమ భక్తి సందేశాలను అందించారు. ప్రతి గ్రామంలో శివాలయం ఉండాలని, భక్తి ఉన్న చోట సిరి సంపదలు, సుఖాలు కొలువై ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మహాదేవమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో పాఠశాల భవనాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

నర్వ: మన ఊరు– మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల భవనాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నట్లు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాయకోడ్‌లో మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన పాఠశాల అదనపు తరగతి గదులను, ఇతర మౌలిక సదుపాయాలను శనివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా పాఠశాలల బాగు కోసం రూ.వేల కోట్ల ఖర్చు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఈఓ లియాకత్ అలీ, ఎంఈఓ లక్ష్మీనారాయణ, ఎంపీపీ జయరాములు శెట్టి, సర్పంచ్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

పరేడ్‌తో శారీరక దృఢత్వం



పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: పోలీసుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమైందని, అందుకు ప్రతి ఒక్కరు వీక్లి పరేడ్‌లో భాగస్వాములు కావాలని ఆర్ఐ విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు వీక్లి పరేడ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు వ్యాయామం చేయాలని, వారానికి ఒకసారి పరేడ్ నిర్వహించడంతో శారీరక దృఢత్వాన్ని పొందవచ్చాన్నరు. అదేవిధంగా పోలీసులు ఉపయోగించే ఆయుధాల గురించి అవగాహన కల్పించారు. సమయపాలన, క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలన్నారు. సర్వీసులో సమస్యలు ఉంటే ఎస్పీని కలిసి పరిష్కరించుకోవాలన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అన్నప్రాసన చేస్తున్న అంగన్వాడీ టీచర్ ప్రసన్న

కోస్గి: వ్యక్తిగత శుభ్రతతోపాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని అంగన్‌వాడీ టీచర్ ప్రసన్న అన్నారు. పట్టణంలోని 8వ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం చేపట్టారు. ఆమె తల్లి బిడ్డల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు, బిడ్డలకు తల్లిపాల ఆవశ్యకత, ఇతర ఆరోగ్య అంశాలపై వివరించారు.

భక్తిశ్రద్ధలతో యల్లాలింగేశ్వర రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మక్తల్: మండలంలోని గుర్లపల్లిలో యల్లాలింగేశ్వర మఠం వద్ద శనివారం సాయంత్రం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పుష్కర నీటితో అభిషేకం చేపట్టారు. ఆయా గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

ఊరూరా స్వామి పల్లకీసేవ



మరికల్‌కు వచ్చిన పల్లకీసేవ



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

మరికల్: ఎక్లాస్‌పూర్ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారిని ఊరురా ట్రాక్టర్‌పై పల్లకీ సేవ నిర్వహించారు. భజన కీర్తనలను ఆలపిస్తూ ఎక్లాస్‌పూర్, కన్మనూర్, మరికల్, మాధవరం వరకు ఊరేగింపు చేపట్టా, భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

వార్షికోత్సవ పూజలు: మండల కేంద్రంలోని వాసవీ కన్యాకపరమేశ్వరి ఆలయ 4వ వారికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేసిన తర్వాత అలంకరణ చేశారు. మహిళలు కుంకుమార్చన నిర్వహించి 108 హారతులతో మంగళహారతి ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి ముందుంటాం



ఊట్కూరులో కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఊట్కూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై నిరంతరం యూటీఎఫ్ ముందుంటుందని రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలో బిజ్వార్, పులిమామిడి, చిన్నపొర్ల తదితర పాఠశాలలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ తరుపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాణిక్‌రెడ్డి పోటీ చేస్తున్నారని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులను, బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని, అక్రమ బదిలీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలాజి, భీమయ్య, రవికుమార్, వెంకటస్వామి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ఎక్లాస్‌పూర్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని ఏఎస్ఐ ఆరీఫ్ అన్నారు. శనివారం మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తుపదార్థలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అదేవిధంగా సైబర్ నేరాల వలలో పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని, వాహన డ్రైవింగ్ సమయంలో హెల్మెట్, సీట్‌బెల్టు ధరించాలన్నారు. విపత్తు నివారణ చట్టం అమలులో ఉన్నందున నిబంధన ఉల్లంఘిస్తే రూ.వెయ్యి జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. నిత్యం యోగా, మెడిటేషన్, వ్యాయామం చేయాలన్నారు.

పండిట్, పీఈటీల జీవితాల్లో వెలుగు నింపాలి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుని బాషా పండిట్‌లు, పీఈటీల జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యశ్వంత్, లక్ష్మీకాంత్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం నిరసన వ్యక్తం చేసి గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలను అందేశారు. అప్‌గ్రేడ్ చేయాలని, ఎస్‌జీటీలు వేసిన కోర్టు కేసు ఉన్నా వాటిని పట్టించుకోకుండా సర్వీసు రూల్స్ మార్చుకుని పదోన్నతులు, బదిలీలు చేపట్టడం సరికాదన్నారు. 2005లో చేసిన విధంగా అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి ఆర్డినెన్స్ ద్వారా న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ఊట్కూరు: మండలంలోని మల్లేపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల వలే తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. చక్కగా బోధించిన విద్యార్థులను సర్పంచ్ మాణిక్యమ్మ బహుమతులను అందించారు.

నేడు వైద్య శిబిరం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం గీత ఆస్పత్రిలో ఉదయం 10గంటల నుంచి ఉచిత కిడ్నీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డా.విశ్వనాథ్ తెలిపారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జాతరలకు ప్రత్యేక బస్సులు

నారాయణపేట రూరల్: శ్రీనివాసుడి జాతరకు ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నట్లు డీఎం ఆంజనేయులు ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎక్లాస్‌పూర్ తిమ్మప్ప స్వామితో పాటు మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండ వేంకటేశ్వరస్వామి జాతరకు పేట నుంచి ప్రతి అరగంటకు బస్సు ఉంటుందని తెలిపారు. ఆది, సోమవారం ప్రత్యేకంగా శిబిరాలను ఏర్పాటు చేసి బస్సులు పంపిస్తామని, భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

అక్రమ అరెస్టులను ఖండించాలి

నారాయణపేట టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా పీడీఎస్‌యూ నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించాలని జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో విద్యారంగానికి కొఠారి కమిషన్ ప్రకారం 30 శాతం నిధులు కేటాయించాలని అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు.

12న శంకరభారతి తీర్థ స్వామి రాక

నారాయణపేట రూరల్: కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని ఎడతొరె యోగనందేశ్వర మఠం పీఠాధిపతి శంకర భారతి తీర్థస్వామి జిల్లా కేంద్రానికి రానున్నారు. ఈనెల 12న సాయంత్రం 4గంటలకు పరిమళాపురంలో నిమజ్జనం ఎరుగని వినాయకుడిని దర్శించుకుంటారు. 6గంటలకు ధార్మిక ప్రవచనం, 13న వినాయక, శ్రీరామ పూజలు, తీర్థ ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నదానం చేపట్టనున్నారు.

నేడు పూసల్‌పహాడ్ టాలెంట్ టెస్ట్

కోస్గి: గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఆదివారం పూసల్ పహాడ్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు శేరి కృష్ణారెడ్డి ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించే పరీక్షను అన్ని మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని, ఏటా 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించే ఈ పరీక్షకు మండలంలోని పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్ఎంల వద్ద పేర్లు నమోదు చేసుకున్న వారు పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు.

వేరుశనగ క్వింటా రూ.7,879

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం వేరుశనగ క్వింటాల్ రూ.7,879, కనిష్టంగా రూ.3,500 పలికింది. ఎర్ర కందులు గరిష్టంగా 7,289, కనిష్టంగా రూ.6,983, తెల్ల కందులు గరిష్టంగా రూ.7,359, కనిష్టంగా రూ.7,300, శనగలు గరిష్టంగా 4,716, కనిష్టంగా రూ.4,651 పలికాయి. జిల్లాలోని కాటన్‌మిల్లుల్లో పత్తి క్వింటా గరిష్టంగా రూ.7,700, కనిష్టంగా రూ.4,651 పలికింది.

వైభవంగా ప్రభోత్సవం



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామికి శనివారం రాత్రి హనుమత్ వాహనసేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన హనుమత్ వాహనంపై స్వామివారిని గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాలు, భక్తుల హరినామస్మరణ మధ్య స్వామివారి సేవ ముందుకు కదిలింది. బంగారు ఆభరణాలు, వివిధ రకాల పూల అలంకరణల మధ్య స్వామివారు హనుమత్ వాహనంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. అలాగే ప్రభోత్సవం నిర్వహించారు. ఇందులో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. మరోదిక్కు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులు స్వామివారికి దాసంగాలు పెడుతూ మొక్కులు తీర్చుకున్నారు. స్నానాల గుండంలో తలస్నానాలు ఆచరించి తడి దుస్తులతోనే స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి 2 గంటలకు స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ముందుగా స్వామివారిని గరుడ వాహనంపై గుట్టపైనున్న గర్భగుడి నుంచి మెట్లమార్గం గుండా ఊరేగింపుగా తేరుమైదానానికి తీసుకువస్తారు. అనంతరం అక్కడ రథం ముందు ప్రత్యేక కుంభం పోసి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం రకరకాల పూలు, విద్యుత్ బల్బులతో శోభాయమానంగా అలంకరించిన రథంపై స్వామివారిని ఊరేగిస్తారు.

వరిలో జాగ్రత్తలు అవసరం



అమరచింత: యాసంగిలో వరి పంటను సాగు చేస్తున్న రైతులు జాగ్రత్తలు పాటిస్తే అనుకున్న దిగుబడి సాధించవచ్చని ఏడీఏ దామోదర్ తెలియజేశారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో శనివారం రైతులు సాగుచేసిన వరి పంటను పరిశీలించారు. ఈ మేరకు రైతులతో కలిసి రైతు వేదికలో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. స్థానిక పొలాల్లో జింక్ లోపాలు ఉన్నాయని, వీటిని గుర్తించామన్నారు. సరైన వ్యవసాయ సాగు పద్ధతులను పాటించాలని, ఏఈఓలు ఇస్తున్న సూచనలను ఎప్పటి కప్పుడు పాటించడంతో పంటలను తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ వినయ్, ఏఈఓ హరిత, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, రైతుబంధు గ్రామ కోఆర్డినేటర్ రాజరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.